# మెదడు ఐస్క్రీంలా తింటాడు!

ఉదయ్ ఉదయం వాకింగ్‌కి బయల్దేరాడు. ఎదురుకుండా వస్తున్న వ్యక్తిని చూచి ఉలిక్కిపడ్డాడు! "ఏమిట్రా హఠాత్తుగా అలా ఉలిక్కిపడ్డావ్! నీ ముఖం కూడా అలా అయిపోయింది!" అన్నాడు కూడా వస్తున్న మిత్రుడు.

"ఓ పది నిమిషాలు ఆగు నీకే తెలుస్తుంది. "జంతర్ మంతర్" అని నాతో చిన్నపుడు చదువుకున్నాడు. వాడు వస్తున్నాడు. మెదడు ఐస్‌క్రీమ్‌లా తినేస్తాడు."

"జంతర్ మంతర్ అంటే ఉత్తర్ దేశం వాడా"

"నీ మొహం! తెలుగువాడే కాని వీడికి బోల్డు కోయ విద్యలున్నాయ్! చిన్నప్పుడు తను అసలు చదవడం లేదని చెప్పి, ఎవ్వరికీ తెలియకుండా చదివేసేవాడు! పైగా ఏం తెలియనివాడిలా సబ్జెక్ట్ గురించి చిన్న చిన్న ప్రశ్నలు వేసేవాడు. తీరా చూస్తే మార్కులు మాత్రం బాగానే వచ్చేవి. వాడి పనులు జాగ్రత్తగా చేసుకుంటూ, ఎదుటివాళ్ళని చెడకొట్టేవాడు. ఈపాటికే చాలాసేపు నడిచేసి వుంటాడు, యిప్పుడు కబుర్లు చెపుతూ మన నడక చెడకొడతాడు" అన్నాడు ఉదయ్.

ఇంతలో, "ఏమిటోయ్ ఉదయ్! నా గురించి ఈయనికి చెప్పేస్తున్నావా!"

"అదేం లేదు నువ్ అమెరికా నుంచి ఎప్పుడు వచ్చేశావ్!"

"ఓ రెండు రోజులయింది! రా పార్కులో కూర్చుని మాట్లాడుకుందాం!" అంటూ పార్కులో ఓ సిమెంట్ బెంచీ మీద కూలేసి తన మామూలు ధోరణిలో తగులుకున్నాడు జంతర్ మంతర్.

"ఆ! ఏమిటోయ్ ఆలా చిక్కిపోయావ్! నేను కనపడకపోతే నీకసలు తోచదులే! అమెరికాలో రోజూ నువ్వే జ్ఞాపకం వచ్చేవాడివి".

'ఎందుకు జ్ఞాపకం రాను! నాకంటె వెర్రివెధవ యింకెవడుంటాడు' అనుకున్నాడు ఉదయ్.

"నేను ఇండియాలో లేని ఈ ఆర్నెల్ల విషయాలు సంక్షిప్తంగా చెప్పు ఉదయ్!"

"ఇవేం వార్తలా! సంక్షిప్తంగా చెప్పడానికి" అన్నాడు ఉదయ్.

"నువ్ చిన్నప్పట్నుంచీ యింతే చాలా హాస్యంగా మాట్లాడతావ్ అందుకే నువ్వంటే చాలా యిష్టం నాకు!"

"పోన్లే! నేను వరస క్రమంగా అడుగుతాను నువ్ చెప్పు" అంటూ, "నేను అమెరికా వెళ్ళే రోజున గుండెపోటుతో హాస్పిటల్‌లో ఎడ్మిట్ అయిన అజయ్ బాల్బీతన్నేసాడా లేక

కాలెత్తి తన్నే ఓపిక లేక బ్రతికిపోయాడా!".

"అదృష్టవంతుడు! నువ్ వెళ్ళే రోజునే గుండెపోటు రావడం వలన బ్రతికిపోయాడు".

"ఆ! అన్నట్లు కమల అని మనతో చదువుకుంది, నేను అమెరికా వెళ్ళినప్పుడు ఆమె రెండోనెల గర్భవతి, పురుడొచ్చిందా! మగపిల్లాడా ఆడపిల్లా!"

"అంటే ఆవిడకి యిప్పుడు ఎనిమిదో నెల! పదినెలల నిండకుండానే పురుడు వచ్చేస్తుందా!"

"ఏమో! ప్రిమెట్యూర్ డెలివరీ ఏమో అనుకున్నాను. సర్లే అది వదిలెయ్!" ఈ జంతర్ మంతర్ ధోరణి చూస్తున్న ఉదయ్‌తో వచ్చిన మిత్రుడు, "అది వదిలెయ్" అంటే యింకో ప్రశ్నతో తగులుకుంటాడన్న మాట అనుకుంటూ ఈ జంతర్ మంతర్ గాడితో తను చదువుకోనందుకు సంతోషించాడు.

అవును మనతో చదువుకున్నాడు "టెంపుల్ స్టెప్స్ గోల్డెన్ కింగ్" ఈ ఆర్నెల్లలో ఎక్కడైనా కనిపించాడా!"

"మనతో ఎవరూ ఫారినర్స్ చదువుకోలేదే!"

"నువ్ బలే జోక్స్ వేస్తావయా! ఫారినర్ కాదయ్యా! "గుడిమెట్ల బంగారు రాజు" వాడ్ని సరదాగా ఇంగ్లీష్‌లో తర్జుమా చేసి పిలిచేవాళ్ళం కదా!

"వాడెక్కడ తగులుకుని బాధపెడతాడో అని వాడు కీర్తిశేషుడయ్యాడని విన్నాను" అన్నాడు ఉదయ్.

"అరే పాపం! చాలా మంచి వాడయ్యా! శీతాకాలంలో కూడా మెదడు ఐస్‌క్రీంలా, యిష్టంగా తినేసేవాడు.

"ఎంతయినా నిన్ను మించినవాడు కాదులే!" అనుకున్నాడు ఉదయ్.

ఇంతలో ఉదయ్‌తో వచ్చిన మిత్రుడు "నేను వెడతానయ్యా! ఆఫీస్‌కి పెందరాడే వెళ్ళాలి.

"అయ్యో! నేటికి చాలిద్దాం! మీరు కూడా రోజూ రండి!" అన్నాడు జంతర్ మంతర్.

"ఈయన విజయవాడ నుండి వచ్చారు. ఈ రోజే వెళ్ళిపోతున్నారు. ఈయన గురించి వెతకొద్దు అన్నాడు ఉదయ్. వాడి మెదడు కూడా రోజూ తింటాడేమోనని!"

జంతర్ మంతర్ వెళ్ళిపోయిన తర్వాత, "అబ్బ! అసలు ఎవరూ లేనట్లు "వీడితో ఎలా చదువుకున్నావురా!" అన్నాడు ఉదయ్ మిత్రుడు.

"ఏం చేస్తాం అంతా నా కర్మ! నువ్ మాత్రం ఎప్పుడూ ఈ పార్క్ వైపు రాకు తర్వాత మరోచోట ఎక్కడైనా కలుద్దాం!" అంటూ యింటి ముఖం పట్టాడు ఉదయ్.

"ఏమిటండీ వట్టి చేతుల్తో వచ్చారు. నేనిచ్చిన సంచీ ఏమయింది! కొన్ని కూరలూ, సరుకులూ తెమ్మని ఓ సంచీ యిచ్చాను కదా! ఆ జంతర్ మంతర్ గానీ మళ్ళీ ఇండియాకి వచ్చేశాడా కొంపతీసి" అంది శ్రీమతి ఉదయ్.

"నువ్వ సరిగ్గా ఊహించావ్! ఆ సంచీ ఎక్కడో మరచిపోయాను".

"అది సరే మరి నే చెప్పిన సరుకులు సంగతి!"

"ఇప్పటి వరకూ ఆ "జంతర్ మంతర్" గాడు నా మెదడు తినేశాడు. ఇక మిగిలిన మెదడు ఇప్పుడు నువ్ తిను. సరుకుల సంగతి జ్ఞాపకం వుంటే సంచి ఎందుకు మరచిపోతాను!"

"ఆ మిగిలిన ఎంగిలి మెదడు నన్ను తినమంటారా! పనికిరాని సన్నాసులతో చదువుకుంటే జీవితం యిలాగే వుంటుంది మళ్ళీ! ఓసారి వెళ్ళి ఆ సంచీ వెతుక్కురండి!"

"నీకేం నువు యింట్లో కూర్చుని బోల్డు విషయాలు పురమాయిస్తావ్. ఆ సంచీ వెతకడానికి వెడితే వాడు మళ్ళీ తగులుకుంటే! వెధవ సంచీ యింకొకటి కొంటాన్లే!"

"ఈ గొడవలన్నీ ఎందుకు ఇంకో ఊరికి బదిలీ చేయించుకొని వెళ్ళిపోదామండి!" అంది శ్రీమతి ఉదయ్.

(రంజని ఉగాది 2012)